# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 12 అక్టోబర్ 2024 www.balagamtv.com పేజీలు 4




పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు బలగం టీవీ విజయదశమి శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా శనివారం కార్యాలయానికి సెలవు. ఆదివారం సంచిక వెలువడదు.


# కులగణనపై ఉత్తర్వులు జారీ !

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో సమగ్ర కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కులగణన కోసం సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహిస్తామని ప్రభుత్వం 18 జీవోలో పేర్కొంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల వారీగా సర్వే చేయనున్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలపై సర్వే చేయనుంది ప్రభుత్వం.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు. సర్వే బాధ్యతను ప్లానింగ్ విభాగానికి అప్పగిస్తున్నట్లు తెలిపారు. 60 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని జీవోలో పేర్కొన్నారు.



# వైద్య ఆరోగ్య శాఖలో 371 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ వైద్యారోగ్య శాఖలో రాష్ట్ర ప్రభుత్వం నియామకాలు చేపట్టనుంది. ఈ మేరకు మరో 371 పోస్టుల భర్తీకి తెలంగాణ మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం దాదాపు 2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు గాను నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ పోస్టులకు మరిన్ని పోస్టులను కలిపి నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో 272 పోస్టులను కలిపింది. దీంతో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల సంఖ్య 2,322కు చేరింది. ఈ పోస్టులను భర్తీ చేయనుంది. అలాగే గతంలో ప్రకటించిన 633 ఫార్మసిస్ట్ పోస్టులకు అదనంగా మరో 99 పోస్టులను కలుపుతూ నోటిఫికేషన్ జారీ చేసింది. నర్సింగ్ పోస్టులకు ఈ నెల 14లోగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని బోర్డు సూచించింది. నవంబర్ 17న కంప్యూటర్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. అలాగే ఫార్మసిస్ట్ పోస్టులకు సంబంధించి ఈ నెల 21 వరకు దరఖాస్తులు స్వీకరించగగా.. నవంబర్ 30న పరీక్ష నిర్వహిస్తామని బోర్డు ప్రకటించింది.





# రెండు గంటలు గాల్లోనే...

- ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం..
- తిరుచ్చి నుంచి షార్జాకు 141 మందితో బయలుదేరిన విమానం
- హైడ్రాలిక్ వ్యవస్థ పని చేయడం లేదని గుర్తించిన పైలట్లు
- ఇంధనం నిర్దేశిత స్థాయికి తగ్గాక ఎమర్జెన్సీ ల్యాండింగ్




**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళనాడులోని తిరుచ్చి ఎయిర్ పోర్టులో ప్రమాదం పెద్ద ప్రమాదం తప్పింది. తిరుచ్చి నుంచి షార్జా బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం గాల్లో ఉండగా సాంకేతిక సమస్య తలెత్తింది. గుర్తించిన పైలట్లు ఎమర్జెన్సీ ప్రకటించారు. హైడ్రాలిక్ వ్యవస్థ పనిచేయడం లేదంటూ తిరుచ్చి విమానాశ్రయాన్ని అప్రమత్తం చేశారు సాంకేతిక లోపంతో దాదాపు మూడు గంటలపాగు గాల్లోనే చక్కర్లు కొట్టిన ఎయిరిండియా బోయింగ్ విమానం చివరికి తిరుచ్చి ఎయిర్ పోర్టులో సేఫ్ గా ల్యాండ్ అయ్యింది. దీంతో ఆ విమానంలోని 141 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

తిరుచిరాపల్లి నుంచి షార్జాకు వెలుతున్న ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ 613 విమానంలో హైడ్రాలిక్ సిస్టమ్ లో సమస్య తలెత్తింది. దీంతో ఆ విమానంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే ఎయిరిండియా విమానాన్ని సేఫ్ ల్యాండింగ్ చేసేందుకు పైలెట్లు తీవ్రంగా ప్రయత్నించారు. ఏటీసీ సలహాల సాయంతో పైలెట్లు ఎయిరిండియా విమానాన్ని సురక్షితంగా కిందకు దించే ప్రయత్నం చేశారు.మరోవైపు ప్రతికూల పరిస్థితులు తలెత్తితే ఎలా అనే అనుమానాలతో ముందస్తు ఏర్పాట్లు కూడా చేశారు. విమానాశ్రయం వద్ద 20 అంబులెన్సులు, 20 ఫైరింజన్లను కూడా ఏర్పాటు చేశారు. అలాగే పారామెడికల్ సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. ఇక అత్యవసర పరిస్థితుల్లో విమానం సేఫ్ ల్యాండింగ్ కావాలంటే.. విమానంలో మిగిలా 3వ పేజీలో

# నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



- గత ప్రభుత్వం 5వేల పాఠశాలలు మూసివేసింది
- అన్ని వర్గాల వారు కలిసి చదువుకోవాలనే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- కేసీఆర్ పిల్లలు రాజ్యాలు ఏలాలా?
- పేదల పిల్లలు బర్లు, గొర్రెలు కాయాల్నా?
- సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ఉన్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొందుర్గులో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొందుర్గులో ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. ఒక్కో స్కూల్ భవనాన్ని రూ.25 కోట్లతో 150 ఎకరాల్లో నిర్మిస్తున్నట్టు చెప్పారు. తండాలు, మారుమూల పల్లెలు, బస్తీల్లో నివసించే నిరుపేదలకు మంచి వైద్యం, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ఒక ఆరోగ్యవంతమైన తెలంగాణను నిర్మించాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. నిరుపేదలను విద్యకు దూరం చేయకూడదన్న ఆలోచనతో చాలా మంది మేధావులు, సామాజిక తత్వవేత్తలతో చర్చించిన మీదట యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వేర్వేరు చోట్ల విద్యా బోధన వల్ల ఈ వ్యవస్థ మమ్మల్ని దూరం పెడుతుందన్న భావన విద్యార్థుల్లో కలిగే ప్రమాదం ఉంది. అలాంటి భావన సమాజానికి, దేశానికి మంచిది కాదు. అందుకే పాతిక ఎకరాల్లో ఒకే క్యాంపస్‌లో అందరూ కలిసిమెలిసి ఒక సోదర భావంతో చదువుకుని రాణించాలన్న సంకల్పంతో ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అన్నారు. నిరుపేదలకు అన్ని రకాలైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఒక్కోచోట 120 నుంచి 150 కోట్ల రూపాయల వ్యయంతో ఈ క్యాంపస్‌లకు శంకుస్థాపన చేస్తున్నాంమన్నారు.

ఒక్కో రెసిడెన్షియల్ స్కూల్‌లో దాదాపు 2500 మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుకుని, భవిష్యత్తులో వారంతా ఉన్నతస్థాయికి ఎదగాలని, తద్వారా మిగిలా 3వ పేజీలో

# గోదావరి పుష్కరాలకు నిధులు గుండు సున్నా

- ఏపీకి 100 కోట్లు తెలంగాణకు గుండు సున్నా.. ఎందుకీ వివక్ష
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

వివరాలు 2వ పేజీలో



# అందరికీ విద్యనందించడమే లక్ష్యం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలకు శంకుస్థాపన

వివరాలు 2వ పేజీలో

# దసరా ఎఫెక్ట్

## 9 రోజుల్లోనే రూ.713 కోట్ల మద్యం అమ్మకాలు



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో దసరా పండగ నేపథ్యంలో.మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. కేవలం 9 రోజుల్లోనే 713 కోట్ల రూపాయలకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. లిక్కర్ విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే రూ.350 కోట్ల అమ్మకాలు అదనంగా ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే ఈ సారి బీర్ల కంటే లిక్కర్ అమ్మకాలే ఎక్కువ జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

# స్కిల్ యూనివర్సిటీలో అందుబాటులోకి కొత్త కోర్సులు

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కిల్ యూనివర్సిటీ(వైఐఎస్‌యూ)లో నవంబరు నుండి కోర్సులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు స్కిల్ యూనివర్సిటీ శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది. దసరా నాటికి కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచనతో ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి పలు కోర్సుల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వీసీ వీఎల్‌వీఎస్‌ఎస్ సుబ్బారావు తెలిపారు.ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 29నాటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతానికి గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో క్లాసులు నిర్వహించనున్నట్లు నవంబరు 4 నుండి మొదలు కాబోతున్న కోర్సులు, లాజిస్టిక్, మెడికల్, హెల్త్, ఫార్మా రంగాల్లో తరగతులు ఉంటాయన్నారు. త్వరలోనే మరిన్ని కోర్సులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కోర్సులకు సంబంధించిన ల్యాబ్స్ కోసం ప్రభుత్వం రూ.7కోట్లు ఇప్పటికే విడుదల చేసిందన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటైంది. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు నియమించిన ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని, ఆ తర్వాతే ఉద్యోగ నియామకాలకు సంబంధించి కొత్త నోటిఫికేషన్లు వేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కమిషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది. ఉపకులాల వారీగా ఎస్సీల వెనుకబాటుతనాన్ని కమిషన్ అధ్యయనం చేయనుంది.ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెకలను పరిగణనలోకి తీసుకొని, ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు నిర్దేశించారు. కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి అందేలా చూడాలని సీఎస్‌కు సూచించారు. మంత్రివర్గ



ఉప సంఘానికి అందిన వినతులపైనా సమావేశంలో చర్చించడంతోపాటు, వాటన్నింటినీ ఏకసభ్య కమిషన్‌కు అందించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయి నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదుల స్వీకరణకు ఉమ్మడి పది జిల్లాల్లో ఒకోరోజు పర్యటించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు.

# గ్రూప్-3 పరీక్ష తేదీలు ప్రకటన

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్ష 2024 పరీక్ష తేదీలను ప్రకటించింది. గ్రూప్-3 సేవల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇప్పుడు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పరీక్ష షెడ్యూల్‌ను పొందుపరిచారు. గ్రూప్ 3 పరీక్ష 17/11/2024, 18/11/2024 తేదీలలో నిర్వహించనున్నారు. ఎగ్జామ్స్‌కు వారం రోజుల ముందు నుంచి హాల్ టికెట్లు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. మోడల్ ఆన్సర్ బుక్‌లెట్లను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు టీజీపీఎస్సీ తెలిపింది.

గ్రూప్ 3 పరీక్ష మూడు పేపర్లలో నిర్వహించబడుతుంది: పేపర్ 1, పేపర్ 2 మరియు పేపర్ 3. ఒక్కో పేపర్ ఒక్కో మార్కుతో 150 బహుళ-ఎంపిక ప్రశ్నలను కలిగి ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ లేదు, కాబట్టి మీరు సరైన సమాధానాల కోసం ఒక మార్కును ఉంచండి. పరీక్ష ఉర్దూ, ఇంగ్లీష్ మరియు తెలుగు అనే మూడు భాషలలో నిర్వహించబడుతుంది మరియు మీరు మీ పరీక్షను మీకు బాగా సరిపోయే ఏ భాషలోనైనా రాయవచ్చు.

పేపర్ 1: జనరల్ స్టడీస్ మరియు జనరల్ ఎబిలిటీస్. పేపర్ 2: చరిత్ర, రాజకీయాలు మరియు సమాజం పేపర్ 3: ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్

# బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే

- మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**బలగం టీవీ, హైదరాబాద్**

మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పిస్తారని ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మంత్రి సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని ఆరోజే ఆ ఇష్యూ ముగిసిందన్నారు. ఈ విషయంపై హైకమాండ్ కూడా ఎటువంటి వివరణ అడగలేదని వివరించారు. గాంధీ భవన్‌లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్ పలు అంశాలను ప్రస్తావించారు.

సురేఖ, సీతక్కలు బలమైన మహిళా నాయకులు అయినందువల్లే సోషల్ మీడియాలో టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాను బీఆర్ఎస్ దుర్వినియోగం చేస్తోందని ధ్వజమెత్తారు. విపక్షంలో ఉన్నప్పుడు తాము తమ పార్టీ గొంతు మాత్రమే వినిపించామని వివరించారు. కానీ బీఆర్ఎస్ మాత్రం ఫోటోలు మార్ఫింగ్ చేసి కొండా సురేఖపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇలా పోస్ట్ చేసిన వారిపై కేసులు మిగిలా 3వ పేజీలో

# ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు శుక్రవారం జారీ చేసింది. పంచాయతీ, మున్సిపల్, వార్డు స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శనివారం నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. కమిటీల కోసం పేర్లు పంపాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది.గ్రామస్థాయిలో సర్పంచి లేదా ప్రత్యేక అధికారి, కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్మన్ మున్సిపాలిటీ స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు ఆఫీసర్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ కన్వీనర్ గా ఉంటారని జీవోలో ప్రభుత్వం పేర్కొంది.

రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని సర్కారు నిర్ణయం తీసుకుంది. ఒక్కో ఇంటికి 5 లక్షల రూపాయలను ప్రభుత్వ ఆర్థిక సాయం అందించనున్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పై అవగాహన, సోషల్ ఆడిట్, అధికారులతో సంప్రదింపులులాంటి కార్యక్రమాలను ఇందిరమ్మ కమిటీలు చేపట్టనున్నాయి.

# అందరికీ విద్యనందించడమే లక్ష్యం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలకు శంకుస్థాపన





**బలగం టీవి, ఖమ్మం**

అన్ని వర్గాల వారిని న్యాయమైన విద్యనందించడం, పేద విద్యార్థులకు ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి విద్యనందించడమే లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లాలోని లక్ష్మీపురంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలకు శంకుస్థాపన పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఎకరాల విస్తీర్ణంలో స్కూల్ మైదానం ఉంటుందని తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అంతర్జాతీయ స్కూల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు భట్టి విక్రమార్క. ప్రత్యేకంగా స్పోర్ట్స్ గ్రౌండ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.అన్ని వర్గాల వారి కోసం విద్యా బుద్ధులు నేర్పేందుకు నాంది పలికామన్నారు. చదువు, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. "ఈ ఏడాది సమీకృత గురుకులాలకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. సంకల్పం, చిత్తశుద్ధి ఉంటే సాధ్యం కానిదేది లేదు. వచ్చే విద్యా సంవత్సరానికి గురుకుల భవనాలు పూర్తి కావాలి. వీటిలో సకల సౌకర్యాలు పొందుపరుస్తున్నాం. ప్రభుత్వ విద్యావిధానం నిర్వీర్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. విద్యాసంస్థల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుంది" అని భట్టి విక్రమార్క తెలిపారు.

విద్యకి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో.. వైద్యానికి కూడా అంతే ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆషామాషీగా నిధులు ఖర్చు చేయడం కాదు.. అన్ని వర్గాల వారిని న్యాయమైన విద్యనందించడమే లక్ష్యం అన్నారు. విద్య, వైద్యానికి బడ్జెట్ లో అధిక ప్రాధాన్యత కల్పించామని తెలిపారు. ప్రజల కోసం అంకితమై పని చేస్తున్నామని తెలిపారు. సంకల్పం ఉంటే.. చేసే పని మంచిది అయితే సాధ్యం కానిది అంటూ ఏది లేదని చేసి చూపిస్తున్నాం. రూ.5వేల కోట్లు ఈ ఏడాది ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం ఖర్చు చేయనున్నామని తెలిపారు.

వేములవాడ నియోజకవర్గంలో

# 2 నూతన పోలింగ్ కేంద్రాలు



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ తర్వాత జిల్లాలో వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో 2 నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతోకలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ 2 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని అన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ తర్వాత సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎటువంటి మార్పులు లేవని , మొత్తం 287 స్కూల్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు.

వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రెండు నూతన పోలింగ్ కేంద్రాలు పెరిగాయని , అదేవిధంగా 3 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మారిందని , అటు వివరాలను రాజకీయ పార్టీలకు తెలియజేసామని అన్నారు. ఓటర్ జాబితా రూపకల్పన పై రాజకీయ పార్టీల ప్రతినిధులు దృష్టి సారించాలని, అక్టోబర్ 29న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల చేయడం జరుగుతుందని, దీనిపై అభ్యంతరాలను, నూతన ఓటర్ నమోదు దరఖాస్తులను నవంబర్ 29 వరకు స్వీకరిస్తామని, డిసెంబర్ 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటర్ జాబితా ప్రచురించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో వేములవాడ మరియు సిరిసిల్ల ఆర్డీవోలు రాజేశ్వర్ రమేష్ , బీఎస్పీ పార్టీ ప్రతినిధి ఏ.రమేష్, భాజాపా పార్టీ ప్రతినిధి రేగుల కనకయ్య, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సంపత్, ఎంఐఎం పార్టీ ప్రతినిధి అహ్మద్ ఖాన్, భారాస పార్టీ ప్రతినిధులు రహీం, జి.రాజన్నతెదెపా పార్టీ ప్రతినిధి శంకర్ గౌడ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు , సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్ల భవనాలకు శంకుస్థాపనలు..







**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సిద్ధం చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్ల భవనాలకు శుక్రవారం శంకుస్థాపనలు జరిగాయి. రాష్ట్రంలోని దాదాపు 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో భవనాల నిర్మాణానికి మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పునాదిరాయి వేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని కొందుర్గులో ఏర్పాటు చేయనున్న బడి భవనాలకు ముఖ్యమంత్రి భూమిపూజ చేయగా మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేశారు. రాష్ట్రవ్యాప్తంగా షాద్‌నగర్,మధిర, కొడంగల్, ఖమ్మం, హుస్నాబాద్, నల్లగొండ, హుజూర్‌నగర్, మంథని, ములుగు, పాలేరు, వరంగల్, కొల్లాపూర్, అందోల్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట్, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, పరకాల, నారాయణ్ ఖేడ్, దేవరకద్ర, నాగర్ కర్నూల్, మానకొండూర్, నర్సంపేట నియోజకవర్గాల్లో శంకుస్థాపనలు జరిగాయి.

### ఖమ్మంలో మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమి పూజ చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. చిత్తశుద్ధితో పేదల అభివృద్ధి కోసం పాటుపడుతున్నామని అందుకే ఇలాంటి పాఠశాలలు 28 ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. మౌలిక సదుపాయలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పథకం కింద రూ.657 కోట్లు కేటాయించినట్టు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్కూళ్ల పెట్టి వసతులు కల్పించలేదన్నారు. ఇప్పుడు తాము మాత్రం రూ.125 నుంచి రూ.150 కోట్లతో అద్భుతమైన నిర్మాలు చేస్తున్నట్టు వెల్లడించారు.

### నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండలోని గందంవారి గూడెంలో ఏర్పాటు చేయబోయే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌పై విమర్శలు చేశారు. కేసీర్ ఫామ్‌హౌస్‌లో పడుకుంటే కేటీఆర్, హరీష్‌రావు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లలో ఒక్క టీచర్ ఉద్యోగం ఇవ్వలేదని కేవలం ఈ కాలంలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. తాము మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశామని, ఉద్యోగాలు ఇస్తున్నామని గుర్తు చేశారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు కూడా త్వరలోనే ఇస్తామని తెలిపారు. కోమటిరెడ్డి.

### మంథనిలో మంత్రి శ్రీధర్ బాబు

పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలంలో అడవి సోమన్ పల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. రాష్ట్రంలో విద్యతోపాటు మిగతా రంగాల అభివృద్ధి కోసం తాము సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు శ్రీధర్ బాబు. ఓవైపు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తూనే ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని తెలిపారు. పదేళ్ల పాటు అప్పులు పెరిగాయే తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు.

# నేతన్నల కుటుంబాలను ఆదుకోవాలి




- 365 రోజుల పని కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలి.
- బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్.

**బలగం టీవీ, సిరిసిల్ల**

ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలను ఆదుకోవాలని, ప్రతి నేతన్న కుటుంబానికి 10 లక్షల ఎగ్జ్రేషియా ప్రకటించాలని బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల లోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో 365 రోజుల పని కల్పిస్తామని, ప్రతి కార్మికుడికి జత మర మగ్గాలు పంపిణీ చేస్తామని ప్రకటించారని కానీ ఉన్న పని లేకుండా చేసి నేతన్నల ఆకలి చావులకు కారణ మౌతున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కాలంలోనే 48 మంది నేత కార్మికుల ఆత్మహత్యలకు పాల్పడ్డారని వారి ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని, ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వమేనని, వారి కుటుంబాలకు 10 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ నాయకులు కొక్కుల ప్రసాద్, రమేష్, ఏనుగుల లింగయ్యా, కసర్ల అరుణ్, గడ్డామిది హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ కాళీ గుడికి భారత ప్రధాని ఇచ్చిన కిరీటం మాయం

**బలగం టీవీ, సిరిసిల్ల**



2021లో బంగ్లాదేశ్‌లోని ప్రఖ్యాత జేషోరేశ్వరీ కాళీ ఆలయానికి ప్రధాని నరేంద్ర మోడీ బహుమతిగా సమర్పించిన విలువైన ఆభరణం చోరీకి గురైంది. ఈ చోరీ ఘటనపై దర్యాప్తు జరిపించాలని బంగ్లాదేశ్ పాలకులను భారత ప్రభుత్వం కోరింది. ప్రధాని నరేంద్ర మోడీ కాళీ మాతకు సమర్పించిన కిరీటం చోరీకి గురికావడం పట్ల ఢాకాలోని భారత హై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆ ఆభరణాన్ని స్వాధీనం చేసుకుని నేరానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్స్ వేదికగా హైకమిషన్ కోరింది.

# గోదావరి పుష్కరాలకు నిధులు గుండు సున్నా



- ఏపీకి 100 కోట్లు తెలంగాణకు గుండు సున్నా.. ఎందుకీ వివక్ష
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

**బలగం టీవి, హైదరాబాద్**

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మరోసారి మొండి చేయి చూపిందని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి పుష్కరాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ. 100 కోట్లు ఇచ్చి, తెలంగాణకు మాత్రం గుండుసున్నా మిగిల్చిందని.. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా, రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా సాధించలేకపోయారని మండిపడ్డారు. తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం పోరాడడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక నిధుల కింద రూ. 15 వేల కోట్లు మంజూరు కాగా.. తెలంగాణకు మాత్రం దక్కింది గుండు సున్నా అన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు నిధులు ఇచ్చారని మా బాధ కాదు, తెలంగాణకు అన్యాయం జరుగుతోందనేదే మా ఆవేదన అని హరీష్ స్పష్టం చేశారు. తెలంగాణకు మొదటి నుండి కేంద్ర ప్రభుత్వం మొండి చెయ్యే చూపుతోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంపై ఇంత వివక్ష ఎందుకు? అని ప్రశ్నించారు. తెలంగాణను ఇతర రాష్ట్రాలతో సమానంగా చూడాలని, హక్కుగా రావాల్సిన నిధులను కచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

తెలంగాణకు హక్కుగా రావాల్సిన నిధుల కోసం పోరాటం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయిని అన్నారు. లోక్‌సభలో బీఆర్ఎస్ బలమైన స్థానంలో ఉండి ఉంటే.. ఈ అన్యాయాన్ని మేము ఎప్పటికీ సహించేవాళ్లం కాదన్నారు.ఎప్పటికైనా ఇంటిపార్టీ బీఆర్ఎస్సే తెలంగాణకు రక్షణ కవచం అన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాలపై ఇప్పటికైనా ఆ పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు.

# ఆంధ్రాకు మరో తుఫాను..!



**బలగం టీవి, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరోసారి తుపాను ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ కేంద్రం హెచ్చరికలు పంపింది. దక్షిణ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం శనివారం నాటికి ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తర్వాత అది పశ్చిమ దిశగా పయనించి నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనంగా బలపడనుందని చెప్పింది. దీంతో ఈ నెల 13 నుంచి 15 మధ్య వాయుగుండంగా రూపాంతరం చెందుతుందని వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి. ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి, ఈనెల 17 నాటికి ఏపీలోనే తీరం దాటవచ్చని భారత వాతావరణ శాఖ భావిస్తోంది. ఇది తుపానుగా బలపడి ఏపీలోని దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు మధ్యలో ఈ నెల 15 నాటికి తీరాన్ని తాకవచ్చని అమెరికా నమూనా అంచనా వేస్తోంది. అల్పపీడనం ఏర్పడిన తర్వాతనే దీనిపై ఒక స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణులు అంచనా.

ఈ అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈ నెల 14 నుంచి 16 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఏలూరు, ప్రకాశం, పల్నాడు, పశ్చిమ గోదావరి, శ్రీసత్యసాయి తదితర జిల్లాల్లో గురువారం తెలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది గోవా, కర్ణాటక తీరాలకు సమీపంలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్య దిశగా కదులుతూ రెండు లేదా మూడు రోజుల్లో మధ్య అరేబియా సముద్రంలో వాయుగుండంగా బలపడుతుందని వాతావరణ శాఖ వివరించింది.

# నేషనల్ కాన్ఫరెన్స్‌కు కాంగ్రెస్ మద్దతు



**బలగం టీవీ, హైదరాబాద్**

జమ్ముకశ్మీర్‌అసెంబ్లీ ఎన్నికల్లో (మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకుగాను 42 స్థానాల్లో గెలిచి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి కాంగ్రెస్‌మద్దతు ప్రకటించింది. ఈ మేరకు జమ్ముకశ్మీర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా.. నేషనల్ కాన్ఫరెన్స్ కీలక నేత ఒమర్ అబ్దుల్లాకు లేఖ అందజేశారు.అంతముందు జమ్ముకశ్మీర్ కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్షం సమావేశమైంది. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి మద్దతు తెలిపి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం తీర్మానం కాపీని పార్టీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్‌కు ఇచ్చారు. ఆయన శ్రీనగర్‌లో ఒమర్ అబ్దుల్లాను కలిసి ఆ తీర్మానం కాపీని అందజేశారు.

తాజా పరిణామాల నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా రేపు లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధతను తెలిపే అవకాశం ఉంది. లెఫ్టినెంట్ గవర్నర్ ఆహ్వానం మేరకు నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ పార్టీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నాయి. మరోవైపు జమ్ముకశ్మీర్‌లో ఏకైక స్థానం గెలిచిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఎన్సీకే తన మద్దతు తెలిపింది.

# నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

వారు దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం.నిరుపేదలను విద్యకు దూరం చేస్తే ఈ దేశ సంపదకే తీవ్ర నష్టం చేసిన వారమవుతాం. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో దాదాపు 5 వేల పాఠశాల లు మూసివేయబడ్డాయి. తద్వారా ముఖ్యంగా దళితులు, గిరిజను లు విద్యకు దూరమయ్యే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయి. చదువుకున్న విద్యార్థుల కొలువుల గురిచి కేసీఆర్ ఎప్పుడైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు. పేదలంతా గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ బతకాలని కేసీఆర్ భావించారని విమర్శించారు.

"కాంగ్రెస్ పార్టీ అందరి పార్టీ, ఇది పేదల ప్రభుత్వం. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సున్నా సీట్లు వచ్చినా.. వారి ఆలోచనా విధానం మారలేదు. కేసీఆర్ గురుకుల పాఠశాలలకు ఎక్కడా సరైన భవనాలు నిర్మించలేదు. పేద విద్యార్థులు, చదువుకునే బడులు, హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను పట్టించుకోలేదు. బీఆర్ఎస్‌కు మాత్రం 33 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించుకున్నారు. చదువుకునే విద్యార్థులను కూడా కేసీఆర్ కులాల వారీగా విభజిం చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ వేర్వేరుగా గురుకులాలు పెట్టారు. కొన్నేళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేకపోవడంతో టీచర్లలో అసహనం ఏర్పడింది. ఈ ప్రభుత్వం 21వేల మంది టీచర్లకు పదోన్నతులు ఇచ్చి ఒక నమ్మకం కలిగించింది" అని సీఎం వివరించారు.

పేదల కోసం పనిచేసే అధికారులను తప్పనిసరిగా ప్రభుత్వం, ప్రజలు ఎప్పుడూ అభినందిస్తారు. విద్యా ప్రమాణాలను పెంచాలన్న లక్ష్యంతోనే సుదీర్ఘ కాలంగా ప్రమోషన్లు లేక ఆందోళనకు గురవుతున్న సందర్భంలో రాష్ట్రంలో 21 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు కల్పించడమే కాకుండా ఎక్కడా వివాదాలకు తావులేకుండా 34 వేల మంది టీచర్లను బదిలీలు చేశాం.ఈ శంకుస్థాపన కార్యక్రమలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి గారు ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భగవంతుడు ప్రజలకు సుఖశాంతులు కలిగించాలి. పాడిపంటలు ఇవ్వాలని, పిల్లలకు మంచి చదువులు, ఉజ్వల భవిష్యత్తును ఇవ్వాలని ఆకాంక్షిస్తూ, ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.



# గూడ్స్ రైలును ఢీకొట్టిన ఎక్స్‌ప్రెస్ రైలు

**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళనాడులోని చెన్నై శివారులో శుక్రవారం రాత్రి రైలు ప్రమాదం చోటు చేసుకుంది. తిరువళ్లూరు సమీపంలోని కావరిపెట్టై వద్ద ఆగి ఉన్న గూడ్స్ రైలును ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎక్స్‌ప్రెస్ రైలుకు సంబంధించిన రెండు బోగీలు దగ్ధమయ్యాయి. మంటలు చెలరేగడంతో పలువురు ప్రయాణికులు గాయపడినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. గూడ్స్ రైలును ఢీకొట్టిన రైలును మైసూర్ – దర్భంగా ఎక్స్‌ప్రెస్ రైలుగా గుర్తించారు. పట్టాలపై నిలబడి ఉన్న గూడ్స్ రైలును అతి వేగంతో వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ప్రమాద ఘటనలో పలు బోగీలు పట్టాలు తప్పాయి. ఘటనాస్థలిలో రైల్వే అధికారులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను సమీప ఆస్పత్రులకు తరలించారు.

# విజయానికి చిహ్నం దసరా పండుగ

- **సీఎం రేవంత్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. దసరా రోజున కుటుంబంలోని సభ్యులందరూ ఒకేచోట చేరి సామూహికంగా సంబురాలు జరుపుకోవడం తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం.. పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం.. శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమని సీఎం గుర్తు చేశారు. తెలంగాణకు నిత్య విజయాలు కలిగాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలను ప్రసాదించాలని సీఎం దుర్గామాతను ప్రార్థించారు

# తెలంగాణ ప్రజల జీవితాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం

- **మాజీ సీఎం కేసీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనలోని చెడు మీద నిత్యం పోరాటం చేస్తూ మంచి దిశగా విజయం సాధించాలనే జీవన తాత్వికతను విజయ దశమి మనకు తెలియజేస్తుందని పేర్కొన్నారు. దసరా రోజు శుభసూచకంగా పాలపిట్టను దర్శించి షమీ వృక్షానికి పూజ చేసి, జమ్మి ఆకును బంగారంలా భావించి పెద్దలకు సమర్పించుకుని వారి ఆశీర్వాదం తీసుకోవడం ఆచారం. తెలంగాణ ప్రజల జీవితాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. అలాయ్ బలాయ్ తీసుకుని పరస్పర ప్రేమాభిమానాలను పంచుకోవడం ద్వారా దసరా పండుగ సందర్భంగా ప్రజల నడుమ సామాజిక సామరస్యం ఫరిడవిల్లుతుంది అని కేసీఆర్ తెలిపారు.

# రెండు గంటలు గాల్లోనే...

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఇంధనాన్ని ఓ స్థాయికి తగ్గించాల్సి ఉంటుంది. ఇందుకోసం పైలెట్లు ఎయిర్‌పోర్టు వద్ద ఎయిరిండియా విమానాన్ని గాల్లో చక్కర్లు కొట్టించారు. సుమారు రెండున్నర గంటలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టిన తర్వాత రాత్రి 8 గంటల 15 నిమిషాలకు ఎయిరిండియా విమానాన్ని సేఫ్‌గా ల్యాండ్ చేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కాగా, ఈ ఘటనను సివిల్ ఏవియేషన్ సీరియస్ గా తీసుకుంది. దీనిపై అంతర్గత విచారణకు ఆదేశించింది. అసలేం జరిగింది? ఎందుకీ సమస్య తలెత్తింది? అనే వివరాలు తెలుసుకునే పనిలో అధికారులు ఉన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే

(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు.

బీసీల విషయంలో పార్టీ సానుకూలంగానే ఉందన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీల పక్షాన మాట్లాడారని,అప్పుడే పార్టీ లైన్ తప్పారని అనడానికి లేదన్నారు. ఎంఐఎంతో స్నేహం వేరు, శాంతిభద్రతల అంశం వేరని స్పష్టం చేశారు. ఫిరోజ్ ఖాన్ వ్యవహారంలో చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సీఎంని కోరినట్లు తెలిపారు. తప్పు మా వాళ్లు చేసినా, వేరే వాళ్లు చేసినా చట్టప్రకారమే చర్యలు ఉంటాయని వివరించారు. దసరా లోపు నామినేటెడ్ పోస్టులు ప్రకటిద్దామని అనుకున్నామని, అయితే హర్యానా, జమ్మూ కశ్మీర్ ఎన్నికల వల్ల సాధ్యం కాలేదన్నారు. నెల లోపు పీసీసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోబోతున్నట్లు వెల్లడించారు.

బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటేనని చెప్పడానికి లిక్కర్ కేసులో కవితకు బెయిల్ రావడమేనని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. అదే కేసులో అరెస్ట్ అయిన మనీష్ సిసోడియాకు బెయిల్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం ఉండడంతోనే ఇరువురు కలిసి తమ పార్టీని ఎదుర్కోవడమే లక్ష్యంగా పని చేస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్‌పై ప్రేమతోనే పలువురు బీఆర్ఎస్ నేతలు తమ పార్టీలోకి వస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు తెలిపారు. త్వరలో మరికొన్ని చేరికలు ఉంటాయని ప్రకటించారు. కొన్నిచోట్ల కొంత ఇబ్బంది ఎదురవుతోందని అందుకే ఇప్పటివరకు చేరికలకు బ్రేక్ వేశామన్నారు. భావితరాల భవిష్యత్ కోసమే హైడ్రా, మూసీ అభివృద్ధి అని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు. మూసీ అభివృద్ధికి లక్షా యాభై వేల కోట్లు ఖర్చవుతాయని తామెక్కడా చెప్పలేదన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి మాటలు విడ్డూరం : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**బలగం టీవీ, హైదరాబాద్**

సీఎం రేవంత్ రెడ్డి మాటలు విడ్డూరం అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆర్ఎస్పీ ఎక్స్ వేదికగా స్పందించారు. "రేవంత్ రెడ్డి గారూ.. మీరు ఈ రోజు కొందుర్గులో మాట్లాడిన మాటలు చాలా విడ్డూరంగా ఉన్నాయి. కేసీఆర్ గారు ఎస్సీ, ఎస్టీలను గొర్రెలకు బర్రెలకు పరిమితం చేసిండ్రని మీరు నింద వేయడం గురించి రేపు అన్ని వివరాలతో మీడియాతో మాట్లాడుతా గాని, ముందు మీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల నుండి ముగ్గురు సాఫ్ట్ బాల్ క్రీడాకారులు తైవాన్ ఇంటర్నేషనల్ టోర్నీకి సెలక్టు అయిండ్రంట, వాళ్ల చార్జీలకు ఐదు లక్షల రూపాయలు కూడా ఇస్తలేరంట మీ అధికారులు..! ఆ పిల్లలు ఇక గొర్రెలు బర్రెలు కాయకపోతే ఏం చేస్తరు? కేసీఆర్ గారి టైంలో అయితే ఇలాంటి ప్రతిభావంతులైన బిడ్డలకు క్షణాల్లో లక్షల్లో డబ్బులు పడేవి. దానికి నేనే ప్రత్యక్ష సాక్షిని" అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

# ఫిబ్రవరి నుంచి 'ఎల్లమ్మ'



- **షూటింగ్ ప్రారంభించనున్న వేణు ఎల్దండి**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గత ఏడాది చిన్నసినిమాగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకున్న చిత్రం 'బలగం' ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కమెడియన్ వేణు ఎల్దండి దర్శకత్వం (డెబ్యూ) వహించిన ఈ చిత్రంలో ప్రియదర్శి ), కావ్య కల్యాణ్ రామ్ హీరోహీరోయిన్లుగా నటించగా.. వేణు ఎల్దండి, మురళీధర్ గౌడ్, జయరామ్, రూప, రచనా రవి కీలక పాత్రల్లో కనిపించారు. అయితే ఈ సినిమా అనంతరం అందరిచూపు దర్శకుడు వేణుపై పడిన విషయం తెలిసిందే. బలగం లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత వేణు ఎలాంటి సినిమా తీయబోతున్నాడు అని సినీ ప్రేక్షకులు ఎదురుచూస్తుండగా.. తన తర్వాతి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ' అంటూ ప్రకటించాడు. అయితే 'ఎల్లమ్మ' అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఎలా ఉండబోతుంది ఎవరు లీడ్ రోల్ చేయబోతున్నారు అనేది సస్పెన్స్‌గా మారింది. ఇక ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ చాలా రోజులు అయిన ఇప్పటివరకు ఎటువంటి అప్‌డేట్ ఇవ్వలేదు. ఇదిలావుంటే చాలా రోజుల తర్వాత ఎట్టకేలకు ఈ మూవీకి సంబంధించి ఒక అప్‌డేట్ వచ్చింది.

ఒక మూవీ ఈవెంట్‌లో బలగం వేణుని నిర్మాత దిల్ రాజు అడుగుతూ.. ఎల్లమ్మ ఎప్పుడు ఉంటుందని ప్రశ్న వేస్తాడు. దీనికి వేణు సమాధానమిస్తూ.. సార్ అంతా మీ చేతుల్లోనే ఉంది మీరు ఇప్పుడు మొదలుపెట్టమన్నా స్టార్ట్ చేస్తాను. నవంబర్ నుంచి స్టార్ట్ చేద్దామా అని అడుగగా.. వద్దు సామీ ఫిబ్రవరి నుంచి స్టార్ట్ చేద్దాం అంటూ దిల్ రాజు అంటాడు. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను ఫిబ్రవరిలో అధికారికంగా లాంచ్ చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు దిల్ రాజు నిర్మాతగా వ్యవహరించనున్నాడు.

# మహ్మద్ సిరాజ్‌కు డీఎస్పీ పోస్టు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఈ ఏడాది ఆగస్టు నెలలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 78లో 600 చదరపు గజాల స్థలాన్ని సిరాజ్‌కు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా సిరాజ్‌కు డీఎస్పీ పోస్టు కేటాయించారు. ఈ మేరకు సిరాజ్‌కు రాష్ట్ర డీజీపీ జితేందర్ శుక్రవారం డీఎస్పీ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖకు సిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బౌలింగ్ వైఫల్యంతోనే ఓడాం : షాన మసూద్



**బలగం టీవి, ముల్తాన్**

బౌలింగ్ వైఫల్యంతోనే ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌లో ఓటమిపాలయ్యామని పాకిస్థాన్ కెప్టెన్ షాన్ మసూద్ అన్నారు. ముల్తాన్ వేదికగా శుక్రవారం ముగిసిన టెస్ట్ మ్యాచ్‌లో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన షాన్ మసూద్ బౌలింగ్ వైఫల్యం తమ పతనాన్ని శాసించిందని చెప్పాడు. 'మనమంతా మూడో ఇన్నింగ్స్ వైఫల్యం గురించే మాట్లాడుతున్నాం. కానీ క్రికెట్ అనేది టీమ్ గేమ్. 550 పరుగుల భారీ స్కోర్ చేసినప్పుడు 10 వికెట్లు తీసి బౌలర్లు అండగా నిలవాల్సింది. కానీ మా బౌలర్లు అలా చేయలేకపోయారు. ఈ తప్పిదమే మా పతనాన్ని శాసించింది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్ ఎలా చేయాలి?.. ఆధిక్యం ఎలా సాధించాలి? ఆ ఆధిక్యంతో మ్యాచ్‌ను ఎలా ముగించాలి? అనేవి ఇంగ్లం డ్‌ను చూసి మేం నేర్చుకోవాల్సి ఉంది. 20 వికెట్లు పడగొట్టేందుకు వారు మార్గాలు కనుగొన్నారు. మా జట్టు ముందున్న అతిపెద్ద సవాల్ కూడా ఇదే. ప్రస్తుతం మేం సిరీస్ మధ్యలో ఉన్నాం. జట్టు మెంటాలిటీ గురించి మాట్లాడుకున్నాం. టెస్ట్ ఫార్మాట్ అత్యుత్తమైన ఫార్మాట్. మెరుగైన ప్రదర్శన చేసిన జట్టును విజయం వరిస్తోంది. పరుగులు చేయడం, వికెట్లు తీయడం విస్మరించలేనివి" అని అన్నాడు.

# 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' టీజర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

టాలీవుడ్ యువ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న తాజా చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. ఈ సినిమాకు స్వామిరారా దర్శకుడు సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ప్రోడక్షన్స్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ మూవీని దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది.




ఈ సినిమాలో నిఖిల్ రేసర్‌గా కనిపించబోతున్నాడు. హైదారాబాద్‌లోని ఒక బస్తిలో ఉండే నిఖిల్ లండన్ వెళ్లి ఒక తెల్ల పిల్లను ప్రేమలో పడేసి లైఫ్‌లో సెటిల్ అయిపోదాం అనుకుంటాడు. అయితే దీనికోసమే లండన్ వెళ్లిన నిఖిల్‌కు అక్కడ ఎదురైన సంఘటనలు ఏంటి అనేది ఈ మూవీ స్టోరీ అని తెలుస్తుంది. ఓ లవ్ స్టోరీతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉండబోతున్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఇక కన్నడ చిత్రం సప్త సాగరాలు దాటి సినిమాతో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది.

# నేడు 'విశ్వంభర' టీజర్

**బలగం టీవి, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి యువీ క్రియేషన్స్ లో డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వంలో 'విశ్వంభర' సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో త్రిష, ఆషిక రంగనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విశ్వంభర టైటిల్ గ్లింప్స్, చిరంజీవి పోస్టర్ రిలీజ్ చేయగా తాజాగా నేడు విశ్వంభర సినిమా నుంచి మరో అప్డేట్ ఇచ్చారు. విశ్వంభర సినిమా టీజర్ శనివారం దసరా సందర్భంగా విడుదల చేయబోతున్నట్టు ప్రకటించారు. దసరా సందర్భంగా ఉదయం 10:49 గంటలకు విశ్వంభర టీజర్ రిలీజ్ చేయనున్నారు. ఈ ప్రకటనతో పాటు చిరంజీవి కత్తి పట్టుకొని ఉన్న అదిరిపోయే పోస్టర్ కూడా రిలీజ్ చేసారు.




# వేలంలో అధిక ధర పలికేది రోహితే..

- **హర్భజన్ సింగ్**

**బలగం టీవి, హైదరాబాద్**

రోహిత్ శర్మ వేలంలోకి వస్తే అతని కోసం ఫ్రాంచైజీలు ఎగబడుతాయని టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. జాతీయ మీడియాతో ఆయన మాట్లాడుతూ 'రోహిత్ శర్మను ముంబై ఇండియన్స్ రిటైన్ చేసుకుంటుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ అతను వేలంలోకి వస్తే మాత్రం.. రోహిత్ కోసం ఏ జట్టు పోటీపడుతుందో అనేది చూడటానికి రసవత్తరంగా ఉంటుంది. కచ్చితంగా రోహిత్ శర్మ కోసం ఫ్రాంచైజీలు ఎగబడుతాయి. రోహిత్ శర్మ అద్భుతమైన ఆటగాడు. సూపర్ కెప్టెన్. టాప్ క్వాలిటీ కెప్టెన్, ప్లేయర్. ఇప్పటికే మ్యాచ్ విన్నర్‌గా నిరూపించుకున్నాడు. 37 ఏళ్ల వయసులో ఉన్నా అతను ఇంకా చాలా క్రికెట్ ఆడగలడు. రోహిత్ వేలంలోకి వస్తే మాత్రం అతను భారీ ధర పలికే ఛాన్స్ ఉంది. వేలం మొత్తం ఆసక్తికరంగా మారనుంది.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.





ఒకవేళ రోహిత్ శర్మను ముంబై ఇండియన్స్ ప్రథమ ఆటగాడిగా రిటైన్ చేసుకోవాలంటే రూ. 18 కోట్లు చెల్లించాలి. రెండో, మూడో రిటెన్షన్‌గా తీసుకుంటే రూ. 14 కోట్లు, రూ. 11 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. నాలుగో, ఐదో ఆటగాడిగా రిటైన్ చేసుకోవాలనుకుంటే రూ. 18 కోట్లు, 14 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా కాకుండా వేలంలో ఇతర జట్టు కొనుగోలు చేసినా.. ఆర్‌టీఎమ్ కార్డ్ ద్వారా తిరిగి జట్టులోకి తీసుకురావచ్చు.